


# చిగురుటాకు

"మీ ఆయన నక్సలైటట కదా!"

సినిమా టికెట్ క్యూలో నిల్చున్న సుజాత ఆ మాటకి ఉలిక్కిపడింది. సుజాత వెనగ్గా నిల్చుని ఆ మాటన్నావిడ వైపు తిరిగి చూసింది. ఆడవాళ్ళు ఎవరి ముచ్చట్లలో వారున్నారు. అప్పటికింకా బుకింగ్ మొదలవలేదు.

"మొదట పార్ట్ టైం లెక్చరర్ అట కదా!" అంది ఆవిడే.

సుజాతకు ఏమనాలో తెలీలేదు. చిరాగ్గా ఉన్నా... ఊఁ... అంది. సుజాత కళ్ళలో ఆవిడ ఏదో వెతుకుతున్నట్టుగా చూసింది.

"మేం ఈ మధ్యే కొత్తగా మీ స్ట్రీట్‌కి వచ్చాం. మీ ప్రక్కింటావిడ చెప్తే విన్నాను. ఆయన ఈ మధ్యే ఏడేళ్ళ తర్వాత యు.జి (అండర్‌గ్రౌండ్) నుంచి బయటికొచ్చి మీతో కాపురం చేస్తున్నాడని చెప్పింది. ఈ ఏడేళ్ళలో మీ సంసారం బాగా చితికిపోయిందని తెలీడానికి మీ ఇల్లుని చూస్తేనే తెలుస్తుంది..." ఆవిడ ఆప్యాయంగానే అంటుందో, అయ్యోపాపం అన్నట్టుగా అంటుందో సుజాతకు అర్థం కాలేదు. కానీ... ఎక్కడో గుండెల్ని నులిపెడుతున్న బాధ.

చాలా రోజుల తర్వాత సిన్మాకొచ్చింది. ఆడవాళ్ళకు గేటు దగ్గర కుంకుమ భరిణలు కూడా ఇస్తున్న సిన్మా అది. సుజాత సగటు తెలుగు పడుచు. పదో తరగతి పాసవ్వగానే విశ్వనాథంకిచ్చి పెళ్ళి చేసారు తల్లిదండ్రులు. విశ్వనాథం పెళ్ళయ్యే నాటికి యూనివర్శిటీలో ఎమ్మే పాలిటిక్స్ చదువుతున్నాడు. విద్యార్థి రాజకీయాల్లో యూనివర్శిటీలో మంచి పేరు సంపాదించుకున్న విశ్వనాథం ఎమ్మే కాగానే ఉద్యోగం వేటలో పడ్డాడు. అప్పటికే ఏడాది గడిచిపోయింది. సుజాతకు అబ్బాయి పుట్టాడు. ఒక బిడ్డకు తండ్రవగానే ఏ మగాడైనా మరింత సంపాదనలో పడతాడు. కానీ విశ్వనాథంలో ఈ సమాజం పట్ల ఏవగింపు మొదలైంది. బిడ్డ వచ్చిన ఘడియతో నైనా ఉద్యోగ మొస్తుందని ఎదురుచూసింది సుజాత, ఎవరో గడ్డపాయన పుస్తకాలు విపరీతంగా చదువుతున్న విశ్వనాథాన్ని... మీరింత చదివినా మీకెందుకు ఉద్యోగం రావట్లేదండీ అని అమాయకంగా అడిగిన రోజుల్లో నవ్వేవాడు. తరువాత ఒక మిత్రుడు పెట్టిన జూనియర్ కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా చేరాడు.

మొదటి నెల జీతంతో ఏవేవో తెస్తాడని ఊహించుకున్న సుజాతకి నిరాశే ఎదురైంది. విశ్వనాథం ఆ డబ్బుతో అన్నీ పుస్తకాలే కొనుక్కొని రావటం చిరాకేసింది.

బాబుకి కనీసం పాలడబ్బా అయినా తేనందుకు మొదటిసారి గొడవపడింది. ఉద్యోగమొచ్చినా పుస్తకాలెందుకని వాదించింది సుజాత. కానీ ఆ పుస్తకాలు విశ్వనాథం ఆలోచనా ధోరణిని మారుస్తున్నాయని సుజాతకు అర్థం కాలేదు. అతడేదో కొంచెం దూరమవుతున్నట్టు భావించుకొని బాధపడేది. అలాంటప్పుడే విశ్వనాథాన్ని ప్రయివేట్ కాలేజి యాజమాన్యం ఉద్యోగంలోంచి తీసేసింది. విశ్వనాథం నవ్వుకున్నాడు. కానీ సుజాత బావురుమంది. తెలివైన భర్తను తొలగించిన కాలేజీలో స్టూడెంట్లు పాసుకారని శాపనార్థాలు పెట్టింది. ఎందుకు తొలగించారన్న ప్రశ్నకు విశ్వనాథం ఏవో కారణాలు చెప్పాడు.

ఆ తర్వాత కొంత కాలానికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. జీవితం ఇక స్థిర పడిందనుకుంది సుజాత. కాని అతని తిరుగుళ్ళు పెరిగాయి. ఎప్పుడు ఏ ఊరికి వెళ్తాడో తెలీదు. ఊళ్లో వున్నప్పటికీ ఎప్పుడో రాత్రికి ఇల్లు చేరేవాడు. ఓ రోజు అనుకొని సంఘటన జరిగింది. సుజాత జీవితాన్ని దుర్భరంగా మార్చేసిన సంఘటన.

రాత్రి ఎనిమిది గంటల సమయంలో విశ్వనాథం ఇంటిముందు పోలీస్ జీపాగింది. అది గమనించి విశ్వనాథం చీకట్లోకి పారిపోయాడు. పోలీసుల్ని చూసిన సుజాత బాబుని హత్తుకుని భయంగా నిల్చుంది. సుజాతని పక్కకి తోసి విశ్వనాథం కోసం ఇల్లంతా గాలించారు. రోజూ చదివే పుస్తకాల్ని బూతులు తిడుతూ విప్పంటిచారు. అడ్డుకోబోయిన సుజాత మీద బలమైన లాఠీదెబ్బ... ఆ తర్వాత

మరోదెబ్బ... చంకలో బాబు ఏడ్పు... అరగంట సేపు రణరంగమే అయింది. చీకట్లోకి వెళ్లిన విశ్వనాథం మళ్లీ ఇంట్లోకి రాలేదు. సుజాతకీ విషయం తెలిసి గుండెలవిసేలా ఏడ్చింది.

ఇది ఏడెళ్ళ కిందటి సంఘటన.

ఈ ఏడేళ్ళలో సుజాత ఎన్నోసార్లు లాఠీ దెబ్బలు తింది. పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడేవారు. బాబుని కొట్టేవారు రాజీపడుతూ బీడీలు చేస్తూ బతకటం నేర్చుకుంది. బీడీల కట్టలు వేసుకునేటప్పుడు కంపెనీలో అంతా ప్రత్యేకంగా చూసేవారు. ఇంటికొచ్చి మౌనంగా ఏడ్చేది. తన చేతిలో ఏదో మారణాయుధమున్నంత దూరంగా ఉండేవాళ్ళు వాడలోని ఆడవాళ్ళంతా! పోలీసులొచ్చి భీభత్సం చేసినప్పుడు కూడా ఓదార్చడానికి ఎవరూ వచ్చేవాళ్ళు కాదు. ఓదారిస్తే... సానుభూతిపరులట!! (వాళ్ళ భర్తలు చెప్పి ఉంటారు).

ఆడబిడ్డల ముందు, తోటి కోడళ్ళ ముందు తన బతుకొక శిధిలస్వప్నం కావటమే ఆమె భరించలేక పోయేది. చిన్న ఆడబిడ్డ భర్త నాలుగేళ్ళ తర్వాత మస్కట్ నుంచి వస్తున్నాడంటే ఇల్లంతా పండగ జరుపుకున్నారు రెండు రోజులు. ఆ రెండు రోజులైతే సుజాత మనసు విశ్వనాథం కోసం విపరీతంగా పలవరించింది. ఏ బంధువులింట్లో ఎలాంటి ఫంక్షన్ జరిగినా సుజాతనంతా విస్మయంగా చూసేవారు. ఆ చూపులే సుజాతనెక్కడికీ వెళ్ళనిచ్చేవి కావు. బాబుని స్కూల్లో చేర్పించాక విశ్వనాథం వెళ్ళిపోయిన ప్రభావం బాబు మీద రకరకాలుగా పడటం మొదలైంది.

ఓసారి పిస్తోలు బొమ్మని స్కూలుకి పట్టుకెళ్ళినందుకు టీచర్లంతా “మీ

నాన్న సంపాదట్రా" అంటూ నవ్వారు. ఇంటికొచ్చాక బాబు వేసిన ప్రశ్నలకి సుజాత చాలాసార్లు జవాబు తెలీక ఏడ్చింది. ఇలా ఏడేళ్ళ తర్వాత జనజీవితంలో కల్సిపోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంతో ఓ అర్ధరాత్రి ఇంటిముందు జీపాగింది.

శబ్దం విన్న సుజాత బాబుని మరింత గట్టిగా హత్తుకుని భయంగా చూసింది. మొదట తలుపు కొట్టిన చప్పుడు... ఆ వెంటనే... 'అక్కా...' అని పిలుపు. తీయడానికి సంశయించింది.

"అక్కా... విశ్వనాథం వచ్చాడు" క్షణంపాటు గుండె పులకరించినా... గతంలో పోలీసులు తలుపుతీసే వరకూ ఇలాగే బుకాయించిన సంగతి గుర్తొచ్చి ఒళ్ళు జలదరించింది.

"అక్కా... విశ్వనాథం వచ్చాడు." మరోసారి పిలుపు. ధైర్యం కూడగట్టుకొని తలుపు తీసింది.

నిజమే... అయనే... ఆయన... ఎంత మారిపోయారు? ఆయన వెంట మరో ఇద్దరు.

అయన కళ్ళల్లో కూడా నీళ్ళు!! బాబు నిద్రలోంచి వచ్చి భయంగా చూస్తున్నాడు. విశ్వనాథం గొంతులో దుఃఖం పొర్లింది. సుజాత గుండెకు గండిపడింది. బావురుమని మీదపడి ఏడ్చింది. మూడో తరగతి చదువుతున్న బాబుకి వాళ్ళనాన్నని పరిచయం చేసింది. ఈ దౌర్భాగ్యం ఎవరికీ రాకూడదేమో?

అరగంట తర్వాత వెంటవచ్చిన విప్లవ రచయిత, విప్లవ గాయకుడు

జీపులో వెళ్ళిపోయారు. మర్నాడు సుజాత వాడలో గర్వంగా తిరిగింది. అయినా విచిత్రస్థితి.

ఎవరూ తన సంతోషానికి మద్దతు పలికినట్టు కన్పించలేదు. విశ్వనాథానికి ప్రభుత్వం తిరిగి ఉద్యోగమివ్వటంతో బంధువులు అప్పుడప్పుడు రావడం మొదలెట్టారు. సుజాత మళ్ళీ మనిషైనంత ఆనందంగా ఉంది.

అప్పుడే 'బెల్' మోగటంతో క్యూలో చలనం వచ్చింది. సుజాత ఆలోచనల్లోంచి తేరుకుని ఒక టిక్కెట్ తీసుకొని బయటపడింది. వెనుకావిడ కూడా నాలుగు టిక్కెట్లతో రాగానే భర్త పిల్లలు ఎదురొచ్చారు. ఆమె సుజాతవైపు చూసింది. ఆ చూపులో "మీ ఆయన రాలేదే" అన్న అర్థం! సుజాత మనసు మరోసారి చివుక్కుమంది. సిన్మాకు రమ్మని అడిగితే ఆ సిన్మాలు నాకిష్టముండవు అంటాడు. తనిష్టం కోసమైనా రావాలనుకోడు! షాపింగ్‌కెళ్దామంటే నువ్వెళ్ళు అంటూ డబ్బులిస్తాడు. ఇలాంటి విషయాల్లోనే సుజాత విపరీతంగా బాధపడేది. ఆ బాధ కాస్తా కోపంగా మారుతోందిప్పుడు...

అస్తవ్యస్తమైన ఆలోచనల్లోనే సుజాత సిన్మా చూసింది. సిన్మా అయిపోయి ఇంటివైపు నడక ప్రారంభించింది. సగం దూరం వచ్చాక పక్కనుంచి వేగంగా స్కూటర్ వెళ్లింది. స్కూటర్ మీద థియేటర్ దగ్గర మాట్లాడినావిడ, భర్త పిల్లలు.

జీవితంలో ఒక్కసారైనా ఆయన స్కూటర్ నడిపితే వెనగ్గా కూచోని తిరగాలనే ఉబికి వచ్చిన కోరిక... ఆ కోరిక చుట్టూ పొగలా కమ్ముకుంటున్న నిర్లిప్తత...

ఇంటికెళ్ళేసరికి విశ్వనాథంతో పాటు మరో ఆరుగురు వ్యక్తులున్నారు. బాబు బడినించి అప్పుడే వచ్చి నోట్స్ రాసుకుంటున్నాడు.

రష్యా... తిరుగుబాటు... పోరాటం... మార్క్స్... ప్రపంచ కమ్యూనిస్టుల పై ప్రభావం...

ఆ గదిలో రష్యాలో జరిగిన మార్పుల నించి గుజరాత్ మత కల్లోలాల వరకు తీవ్రమైన చర్చ జరుగుతోంది.

ఆ పదాలు వింటున్న సుజాత మళ్లీ చిగురుటాకులా వణికింది.

బాధగా కణతలు రుద్దకుంటుంటే పైకప్పు నుంచి మట్టిపెళ్ళ పడింది. శిధిలావస్థలో ఉన్న ఇల్లుని దీనంగా చూసింది.

"వీళ్ళు ఈ పూట ఇక్కడే తింటారు" అన్నాడు విశ్వనాథం.

అమాటతో సుజాతను నిస్సత్తువ ఆవరించింది. సినిమా చూసి అంత దూరంనుంచి నడిచి వస్తే.. ఏమిటి ఈ మనిషి...? పెళ్ళయి ఇన్నేళ్ళయినా అర్థం కాని మనిషి..

ఆయన సమాజపరంగా ఏమైనా సాధించాడేమో... కానీ...

కుటుంబపరంగా ఏం సాధించారు? ఇలాంటివాళ్ళు పెళ్లెందుకు చేసుకుంటారో...

సుజాత ఇప్పుడు మనసుతో పోరాటం చేస్తోంది.

సహచర్యంతో కూడా విశ్వనాథం ఆలోచనల్ని చేరుకోలేని సుజాత

ఆలోచనలు సుజాతవి. తమ ఇంటికి కొద్ది దూరంలో ఉన్న వేపచెట్టు క్రింద ఇద్దరు అపరిచిత వ్యక్తులు తచ్చాడుతుండటం మూడు రోజుల్నించి గమనిస్తోంది. సుజాత జీపు శబ్దాలు విన్నా... అపరిచిత వ్యక్తులు ఇంటి ముందు కనిపించినా చిగురుటాకులా వణుకుతోంది.

ఇంతలో ముందు గదిలోంచి ఓ వ్యక్తి పాట అందుకున్నాడు. ముందు కూడా ఇలాంటి చర్చలు సమావేశాలు, పాటలు, గొష్టులు ఇంట్లో జరిగేవి. స్థిమితపడి ఏడాదికూడా కాలేదు. మల్లా ఏడేళ్ళక్రితం చరిత్ర పునరావృతమౌతే...??

ఒక తాగుబోతును కట్టుకున్నా... ఇంత నరకయాతన అరణ్యరోదన ఉండదేమో? సుజాత ఆలోచనల్లో ఉండగానే పాట పూర్తయింది.

"సుజాత... ఇంకా వంట కాలేదా?" ఆయన తన ప్రక్కన ఎప్పుడు ఇంత ఆనందంగా ఉండరు. ఇంట్లో కనీస అవసరాలు చూడని వ్యక్తి సమాజం గురించి కలలు కనడం... సుజాత విసుక్కుంది.

ఎవరైన తన బంధు మిత్రులు వచ్చినప్పుడు "అదేంటో సుజాతా... మీ ఆయన గవర్నమెంట్ ఉద్యోగి. అయినా కనీసం కలర్ టి.వి., ఫ్రిజ్, కూలర్, విసిడి. ఏవీలేవు. మేమైతే కంప్యూటర్ కూడా కొనాలనుకుంటున్నాము." అంటూ ఎగతాళిగా మాట్లాడినప్పుడల్లా... బాదేసేది. ఎప్పుడైనా విశ్వనాధాన్ని అడిగితే... బూర్జువా. భూస్వామ్య వ్యవస్థ, పేదరికం, సామ్రాజ్యవాదం, సోషలిజం, కమ్యూనిజం, దారిద్రేఖకు దిగువ ఉన్న ప్రజలు, దళితులు గ్లోబలైజేషన్ అంటూ గంటల తరబడి ఉపన్యాసం దంచుతాడు. అరువైవేల చిట్టి ఎత్తి ఈ మధ్య రెండు పుస్తకాలు

అచ్చువేసాడు. ఆ రోజు ఆయనతో పెద్దగా గొడవ పడింది. అయినా వినలేదు.. అన్యమనస్కంగానే వంట చేసింది సుజాత.

వాళ్లు తిని వెళ్లిపోయాక ముందు గదిలోకి వచ్చింది సుజాత, కొంచెం ధైర్యం తెచ్చుకొని విశ్వనాథాన్ని అడిగింది. "మళ్లీ ఆ పాటలేంటి... ఈ సమావేశాలేంటి? ఈ మధ్య మళ్లీ ఎవరెవరో కొత్త వ్యక్తులు మన ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. మళ్ళీ మునపటి పరిస్థితులు మాత్రం తీసుకురాకండి. అలాంటి వాళ్ళు ఇంకా అండర్‌గ్రౌండ్‌లోనే ఉండాల్సింది. పెండ్లి చేసుకోకుండానే ఉండాల్సింది."

ఇప్పుడేం జరిగిందని కనీసం మాట్లాడడం కూడా మాట్లాడుకోకూడదా?" అన్నాడు విశ్వనాథం కొంచెం ఆవేశంగా.

ఆ మాటకి సుజాతలో అసహనం పెరిగింది. గంటసేపు పరస్పరం అరుచుకున్నారు.

"కట్టుకున్నదానికి మానసికంగా కనీస భద్రత ఇవ్వనప్పుడు... మీరు చేస్తున్నది సంసారం అనే కంటే చాకిరి చేయించుకోవటం అంటేనే మంచిది. ఇంట్లో పొంగి పొర్లే కన్నీటిని గమనించకుండా సమాజం గురించి కలలుగనే మీలాంటి వాళ్ళ కామెర్లకు చచ్చేదాక మందులుండవేమో? ఆ ఏడేళ్ళు ఎలా బ్రతికామో... మీకు ఏమైనా తెలుసా? నావాళ్ళు... నావాళ్ళు... అనే మీ వాళ్ళు ఈ ఏడేళ్లలో నన్ను కనీసం పలకరించడానికైనా రాలేదేం? ఎలా బ్రతుకుతున్నారని అడిగినవాళ్ళు లేరేం? మీ పిల్లల గురించి పట్టించుకోలేదేం? మీ స్నేహితులు, మీ ఉద్యమమిత్రులు

వాళ్ళ కుటుంబాన్ని వదిలేశారా? వాళ్ళ ఇండ్లల్లో కంప్యూటర్లు, టి.వి.లు, ఫ్రిజ్‌లు అన్ని ఉన్నాయి కదా?"

మరుసటి రోజు ఉదయమే పిల్లలతో సహా సుజాత తల్లిగారింటికి వెళ్ళిపోయింది. మూడవరోజు విశ్వనాథం అత్తవారింటికి బయలుదేరాడు. ఆరోజు రాత్రి అతనికోసం అర్ధరాత్రి పోలీసులు తాళాలు పగులగొట్టి ఇల్లంతా వెతికారు. ఎక్కడో ఎవరో పోలీసుల్ని హతమార్చారట అందుకు ప్రతీకారంగా విశ్వనాథం కోసం...

అత్తవారింట్లో ఉన్న విశ్వనాథం బ్రతికిపోయాడు. తనవాళ్ళు అనుకున్న ఎవ్వరు తన పై మళ్ళీ మొదలైన దాడుల్ని ఖండించలేదు. సుజాత భయంతో వణికిపోయింది. విశ్వనాథం మళ్ళీ ఏదో చెప్పబోయాడు.

"ఇక నాకు ఏమి చెప్పకండి"

సుజాత ఏడుస్తోంది.

కుటుంబానికీ... ఉద్యమానికీ మధ్య నిలబడ్డ విశ్వనాథం మనసంతా కల్లోలమే...

(శ్యామలక్కకు అభిమానంతో...)

*